
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5 కర్ణాటక వార్తలు
శనివారం 27 సెప్టెంబరు 2025



అనర్హులపై వేటు..!





● 29 లక్షల పింఛన్ల రద్దుకు ప్రభుత్వం సిద్ధం ● 6 లక్షల మంది దివ్యాంగులకూ పొంచి ఉన్న ముప్పు

బెంగళూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం పరిశీలనల పేరిట అనర్హులపై వేటు వేసేందుకు శాఖలపరంగా వ్యూహాలకు పదునుపెట్టింది. ఏకంగా 8 లక్షల బీపీఎల్ కార్డులు గల్లంతు కానున్నాయని ప్రచారం సాగుతోంది. 7.5లక్షలకుపైగా అనర్హులు బీపీఎల్ కార్డులు కలిగి ఉన్నారని పౌర ఆహార సరఫరాలశాఖ గుర్తించింది. ఆదాయపన్ను చెల్లించేవారు, ట్రాక్టర్‌లు, ఎక్సవేటర్‌లు కల్గినవారే కాకుండా పది ఎకరాలకు పైగా భూమి కల్గినవారు, ప్రభుత్వ ఉద్యోగులు కూడా బీపీఎల్‌కార్డులు కల్గినవారు ఉన్నారని గుర్తించారు. బీపీఎల్ కార్డులు పొందేందుకు ప్రధాన కారణంగా చౌకధాన్య డిపోల ద్వారా ఇచ్చే నిత్యావసర వస్తువులు, నెలవారీ గృహలక్ష్మి ద్వారా అందే 2వేల రూపాయల కోసం కాకుండా వైద్యానికి సంబంధించి ఉచిత చికిత్సలు పొందేందుకు ఎంత మంది అధికారుల చుట్టూ ప్రదక్షిణలు వేసి అయినా బీపీఎల్ కార్డులు పొందారు. ప్రభుత్వం అనర్హులను తొలగించాలని సాగిస్తున్న కసరత్తులో తొలివేటు రేషన్‌కార్డులపై వేశారు. అంతలోనే సామాజిక పింఛన్లను అనర్హులు పొందుతున్నవారిని రద్దు చేసేందుకు సిద్ధమయ్యారు. సామాజిక పిం చన్ల దుర్వినియోగాన్ని నియంత్రించేందుకు పరిశీలనా ప్రక్రియకు శ్రీకారం చుట్టారు.

ఆధార్‌తో లింకు కాకపోతే అంతే సంగతులు

పింఛను లబ్ధిదారులు వారు సమర్పించిన ఆధార్‌తో అనుసంధానం కావడం లేదు. సాధారణంగా 60ఏళ్లు పైబడినవారికి పింఛను మంజూరు చేస్తారు. కొన్నేళ్లకాలంగా పింఛను పొందుతున్నవారి ఆధార్ ప్రకారం 45, 50ఏళ్లలోపు వారు కూడా ఉన్నారు. 60ఏళ్లలోపు ఉండేవారే ఎక్కువమంది అనర్హులు ఉన్నారు. దివ్యాంగులకు వైద్యశాఖ అందించే వికలత్వం ఎంతశాతం అనేది సర్టిఫికెట్‌ను మంజూరు చేస్తారు. ఇందులోనూ భారీ తేడాలు ఉన్నట్లు గుర్తించారు. కేవలం ఒక చేతివేలు కోల్పోయినవారు సైతం దివ్యాంగుల కోటాలో పింఛను పొందుతున్నట్లు గుర్తించారు. ఇలాంటి వ్యత్యాసాలకు చెక్ పెట్టాలని ప్రభుత్వం గుర్తించింది. ఆధార్‌తో పొంతనకాని పింఛన్లు 23 లక్షలదాకా ఉన్నట్లు తెలుస్తోంది. ఇక దివ్యాంగులకు సంబంధించి 6 లక్షల పింఛన్లలోనూ అవకతవకలు ఉన్నట్లు తెలుస్తోంది. దీనినిబట్టి ఏకంగా 29లక్షల పించన్లు రద్దు చేస్తే రేషన్‌కార్డులపైనా భారీగానే వేటు వేసే అవకాశం ఉంది. ఇలా ప్రభుత్వం నుంచి అర్హత లేకుండా పొందుతున్నవారి సౌలభ్యాలను రద్దు చేయాలనేది ప్రభుత్వ ఆశయంగా ఉంది.

పలు పథకాల్లో ఏరివేతకు రెడీ

రాష్ట్రంలో వివిధ వర్గాలకు పలు విధమైన పథకాల పేరిట పించన్లు ఇస్తున్నారు. సంధ్యా సురక్షాపథకంలో 60-79ఏళ్ల వారికి రూ.400, 80ఏళ్లు పైబడినవారికి రూ.500 ఇస్తున్నారు. ఇందిరాగాంధీ జాతీయ వృద్ధాప్య పథకం కింద రూ.200, వితంతువులకు రూ.800, దివ్యాంగులకు వారి అర్హతను బట్టి రూ.800 నుంచి రూ.2వేలు దాకా ఇస్తున్నారు. ఇక విడాకులు పొందిన మహిళలకు మనస్విని పించను పథకం, మంగళముఖిలకు మైత్రి పథకం కింద పించన్లు ఇస్తున్నారు. దక్షిణకన్నడ జిల్లా పరిధిలో ఎండోసల్ఫాన్ బాధితులకు ప్రత్యేక పించను విధానం అమలు చేస్తున్నారు. యాసిడ్ దాడికి గురైన మహిళలకు, అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యలు చేసుకున్న రైతు భార్యలకు, మాజీ దేవదాసిలకు, గోవా ఉద్యమం పోరాట కుటుంబీకులకు ఇలా రాష్ట్రంలో 12 సామాజిక పించన్లు అమలులో ఉన్నాయి. పించన్లు పొందేవారికి ఆధార్ అనుసంధానం చేసే ప్రక్రియ అమలు చేశారు. కొన్నేళ్లకాలంగా పించను తీసుకునేవారికి కూడా ఆధార్ అనుసంధానం చేసే ప్రక్రియను తీసుకొచ్చారు. ఇలా అన్ని రకాల పించన్లు కలిపి ఏడాదికి 10,500 కోట్ల రూపాయలు పింఛన్లు అందిస్తున్నారు. లబ్ధిదారులలో అనర్హులను ఏరివేసేందుకు రెవెన్యూశాఖ మొబైల్ అప్లికేషన్‌ను సిద్ధం చేసింది. గ్రామపంచాయతీ ద్వారా అనర్హులపై వేటు వేసేందుకు కసరత్తు సాగిస్తున్నారు. ఏకంగా 29 లక్షల పించనుదారులు సమర్పించిన రికార్డులు సమగ్రంగా లేవని అంచనాకు వచ్చారు.



మహాలక్ష్మీ నమోస్తుతే





బళ్లారిలో మహాలక్ష్మి అలంకరణలో చిన్నదుర్గమ్మ, వాసవీమాత



వైష్ణవి అలంకరణలో విద్యారణ్యపుర పరమేశ్వరి

రాష్ట్రవ్యాప్తంగా పలు ఆలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనం ఇచ్చారు. శరన్నవరాత్రుల్లో ఐదో రోజు బళ్లారిలోని చిన్నదుర్గమ్మ.. మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

7

శ్రీరంగపట్టణంలో దసరా ఉత్సవాలకు శ్రీకారం

● వేడుకలను ప్రారంభించిన దర్శకుడు నాగాభరణ ● అంబారి మోసిన మహేంద్ర గజరాజు



అంబారిపై ఊరేగుతున్నచాముండేశ్వరీ దేవి



ఉత్సవాలను ప్రారంభిస్తున్న దర్శకుడు నాగాభరణ

బెంగళూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): దసరా అంటే మైసూరు ఉత్సవాలే గుర్తుకొస్తాయి. ఆ తర్వాత అంతస్థాయిలో మండ్య జిల్లా శ్రీరంగపట్టణలో నిర్వహించడం ఆనవాయితీ. 415వ శ్రీరంగపట్టణ దసరా ఉత్సవానికి గురువారం శ్రీకారం చుట్టారు. కిరంగూరు బన్నిమంటపంలో పూజల అనంతరం ప్రముఖ సినీ దర్శకుడు టీఎస్ నాగాభరణ ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. చేశారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి చలువరాయస్వామి ముఖ్యులు పాల్గొన్నారు. మహేంద్ర గజరాజు నాల్గోసారి అంబారిపై చాముండేశ్వరిదేవిని మోసింది. కుమ్కి ఏనుగులు కావేరి, లక్ష్మి వెంట సాగాయి. ఉత్సవాలలో శ్రీరంగపట్టణ ఎమ్మెల్యే, చాముండేశ్వరి విద్యుత్ సంస్థ అధ్యక్షుడు రమేశ్ బండిసిద్దేగౌడ, మండ్య ఎమ్మెల్యే రవికుమార్, మాజీ ఎమ్మెల్యే విజయలక్ష్మి బండిసిద్దేగౌడ, జిల్లా అధికారి కుమార, జడ్పీ సీఈఓ కేఆర్ నందిని ముఖ్యులుగా పాల్గొన్నారు. జంబూసవారిలో పూజా కుణిత, తమటె, నగారి, పట్టకుణిత, పులివేషం, వీరగాసె, వీరభద్ర కుణిత, కాళి కుణిత, కంసాళె, వీరమక్కళ కుణిత, ఒనకె కుణిత, కోలాటం, కరగిద కోలాట, మరబొమ్మలు, డొళ్ళుకుణిత తదితర కళాబృందాలు సందడి చేశాయి. మహిళలు పూర్ణకుంభాలతో సాగగా, మంగళవాయిద్యాలు, గుర్రాలపై పోలీసుబ్యాండు, కేరళకు చెందిన కయ్యాం కళాకారుల బృందం ఆకట్టుకుంది. నాలుగురోజులపాటు ఉత్సవాలు కొనసాగనున్నాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు విశేషంగా తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని పునీతులయ్యారు. స్థానిక నేతలు, నాయకులు పాల్గొన్నారు.

నెట్టికంటికి రూ.2.25 కోట్లు

● రాతి ముఖమండపం నిర్మాణానికి ముందుకొచ్చిన దాతలు



దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో స్వామివారి గర్భాలయం, విమాన గోపురం, ముఖమండపం రాతితో నిర్మించేందుకు దాతలు ముందుకొచ్చారు. కర్ణాటకలోని రాయచూరు పట్టణానికి చెందిన నవోదయ విద్యాసంస్థల అధినేత, తెలంగాణ రాష్ట్రంలోని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే రాజేంద్రరెడ్డి కసాపురం ఆలయంలో గర్భాలయం, విమాన గోపురం, ముఖమండపాన్ని రాతితో నిర్మించేందుకు రూ.2.25 కోట్లు ఇవ్వనున్నారు. ఈ మేరకు అంగీకార పత్రాన్ని ఆలయ ఈఓ విజయరాజుకు శుక్రవారం రాయచూరులో అందజేశారు. అనంతరం ఆయనకు వేదపండితులు, అర్చకులు.. స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు రాఘవాచార్యులు, వేద పండితులు సాయికుమార్‌శర్మ, ఏఈఓ వెంకటేశ్వరుడు పాల్గొన్నారు.

పంచభూతాల్లో లీనమైన సాహితీ దిగ్గజం భైరప్ప

● ప్రభుత్వ లాంఛనాలతో మైసూరులో అంత్యక్రియలు ● హాజరైన కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి తదితరులు



జాతీయ పతాకంతో గౌరవ లాంఛనం



కేంద్రప్రభుత్వ ప్రతినిధిగా నివాళి అర్పిస్తున్న కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి

బెంగళూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సాహితీదిగ్గజం ఎస్ఎల్ భైరప్ప పంచభూతాలలో లీనమయ్యారు. శుక్రవారం భైరప్ప అంత్యక్రియలు ప్రభుత్వ లాంచనాలతో మైసూరు చాముండి కొండల సమీపంలోని స్మశానవాటికలో నిర్వహించారు. బ్రాహ్మణ సంప్రదాయబద్ధంగా విధివిధానాలు జరిపారు. పెద్దకొడుకు రవిశంకర్ అంత్యక్రియలు జరపగా, చిన్నకుమారుడు ఉదయ్‌శంకర్ కూడా ఉన్నారు. బుధవారం తుదిశ్వాస వీడిన ఎస్ఎల్ భైరప్ప పార్థివదేహాన్ని గురువారం బెంగళూరు నుంచి మైసూరుకు తీసుకొచ్చారు. మైసూరు కళామందిరంలో కడపటి సందర్శనకు ఉంచారు. ఆ తర్వాత రాత్రి జేఎస్ఎస్ ఆసుపత్రిలో ఉంచారు. శుక్రవారం ఉదయం పార్థివదేహాన్ని కువెంపునగర్‌లోని ఇంటికి తీసుకెళ్లారు. అక్కడ బంధుమిత్రులు కడచూపు చూశారు. ఇంటి వద్దనే బ్రాహ్మణ సంప్రదాయంతో క్రియలు జరిపారు. స్మశానవాటికకు తీసుకెళ్లగా జాతీయ పతాకాన్ని కప్పి గాలిలోకి మూడురౌండ్లు కాల్పులు జరిపి గౌరవం సమర్పించారు. కేంద్రప్రభుత్వ అధికార ప్రతినిధిగా మంత్రి ప్రహ్లాద్‌జోషి హాజరై పుష్పగుచ్ఛాన్ని ఉంచి నివాళులు అర్పించారు. మంత్రి మహదేవప్ప, మంత్రి వెంకటేశ్ జిల్లాఅధికారి లక్ష్మీకాంత రెడ్డి పాల్గొన్నారు. అధికార లాంచనాల తర్వాత జాతీయ పతాకాన్ని మంత్రి మహదేవప్ప వారి కుమారులకు అప్పగించారు. పెద్ద కుమారుడు రవిశంకర్ తండ్రిచితికి నిప్పుపెట్టారు. ఇటీవలకొంతకాలంగా ఎస్ఎల్ భైరప్ప బాగోగులు చూస్తున్న సహన విజయకుమార్ కూడా ఉన్నారు. సాహిత్య అభిమానులు బంధుమిత్రులు పాల్గొన్నారు. మైసూరు మాజీ ఎంపీ ప్రతాప్‌సింహ పాల్గొన్నారు.



బోల్తా పడిన బస్సు

స్లీపర్ బస్సు బోల్తా
● 15 మందికి గాయాలు
● కుక్కను తప్పించబోయి ప్రమాదం

7

టీటీడీ ఆలయంలో ప్రతి భక్తుడికి సౌకర్యాలు
● కమిటీ చైర్మన్ కనకమేడల వీర

7

మహిళల స్వావలంబనకు ప్రాధాన్యం

నాణ్యమైన ఆభరణాలు అందించడమే రీగల్ ఆశయం

● మారతహళ్ళిలో షోరూం ప్రారంభించిన ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి



రీగల్ షోరూం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మంజుళా లింబావళి, చైర్మన్ శివదాసన్, ఎండీ సీఈఓ విబిన్ శివదాస్



తొలి వినియోగదారుడికి నగల అందజేత

బెంగళూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): బంగారం ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని వినియోగదారులకు నాణ్యమైన ఆభరణాలతోపాటు హోల్‌సేల్ ధరలతోనే రిటైల్‌గా ఇవ్వడమే రీగల్ జ్యువెలర్స్ ఆశయమని చైర్మన్ శివదాసన్ అభిప్రాయపడ్డారు. మారతహళ్ళిలో రీగల్ జ్యువెలర్స్ షోరూంను ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి శుక్రవారం లాంచనంగా ప్రారంభించారు. ఎండీ సీఈఓ విబిన్ శివదాస్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ గోపాల్ ఎంలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివదాసన్ మాట్లాడుతూ 47 ఏళ్ల ఆభరణాల వ్యాపార పరంపరలో ఎంతో మంది వినియోగదారుల నమ్మకం పొందామన్నారు. బెంగళూరులో కమ్మనహళ్ళి, మల్లేశ్వరం శాఖలలో ప్రజాదరణ సాధ్యమైందని మారతహళ్ళి ప్రాంతానికి చెందిన నగర ప్రజలకోసం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఎమ్మెల్యే మంజుళ మాట్లాడుతూ మారతహళ్ళిలో బంగారు ఆభరణాల దుకాణం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. మహిళలకు బంగారం అంటే ఎంతో ఇష్టమన్నారు. కానీ మార్కెట్‌లో ధరలు పెరిగాయని, భారీ వ్యయం చేసి నమ్మకం ఉన్నచోటునే కొనుగోలు చేయాలని భావిస్తారన్నారు. విబిన్ దాస్ మాట్లాడుతూ అత్యుత్తమ నాణ్యత కల్గిన ఆభరణాలు, ప్రీమియం షాపింగ్ కల్గిన అనుభవాన్ని అత్యంత పోటీతత్వంలోనూ హోల్‌సేల్ ధరలకే అందిస్తున్నామన్నారు. శివదాస్ తామరేశ్వరి రీగల్ జ్యువెలర్స్‌ను ప్రారంభించారని, ఆ నమ్మకం, ఆధునిక డిజైన్లతోపాటు బంగారం, వజ్రాభరణాలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు.



వేడుకలలో విద్యార్థుల ఉల్లాసం





ప్రసంగిస్తున్న వీసీ సుదర్శన్‌రావు

ప్రతి విద్యార్థి ఉద్యోగాలు సృష్టించాలి

పరిశోధనలతో జ్ఞానాన్ని పెంచుకోవాలి

జేఎన్‌టీయూఏ వైస్ చాన్స్‌లర్ సుదర్శన్‌రావు

ఘనంగా ఇంజనీరింగ్ విద్యార్థుల ఫ్రెషర్స్ డే

అనంతపురంరూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఉద్యోగం కోసం కాకుండా ఉద్యోగాలు సృష్టించే ఆలోచనలతో ముందుకు సాగాలని జేఎన్‌టీయూఏ వీసీ సుదర్శన్ రావు సూచించారు. జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో శుక్రవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ వేడుకలకు జేఎన్‌టీయూఏ వీసీ సుదర్శన్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా రిజిస్ట్రార్ కృష్ణయ్య, కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డితో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం వీసీ మాట్లాడుతూ..జేఎన్‌టీయూ కళాశాలకు 79ఏళ్ల చరిత్ర ఉందన్నారు. ఇందులో చదవడం విద్యార్థులకు వరమన్నారు. ఇక్కడ విద్యార్థుల్లో జూనియర్లు, సీనియర్లు అనే తారతమ్యాలు ఉండవని. అందరూ కలిసి చదువుతున్నారన్నారు. విద్యార్థులకు ఇంజనీరింగ్ చదివే సమయం చాలా విలువైందన్నారు. మంచి నడవడిక, క్రమశిక్షణతో ఎప్పటికప్పుడు కొత్త విషయాల మీద పరిశోధనలు చేస్తూ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు సివిల్ సర్వీసెస్ వైపు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ డైరెక్టర్లు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, కళాశాల సీనియర్ ఆచార్యులు, విభాగాధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



అలరించే నృత్య ప్రదర్శన

అదరగొట్టిన విద్యార్థులు

ఫ్రెషర్స్ డేను పురస్కరించుకుని విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. విద్యార్థులు ఆటపాటలతో అదరగొట్టారు. తెలుగుదనం ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తమ అభిమాన సినీ నటీనటుల పాటలకు విద్యార్థులు ఉత్సాహంగా డ్యాన్స్ నిర్వహించారు. వారిని ఉత్సాహపరుస్తూ మిగతా విద్యార్థులు ఈలలు, కేకలతో ఆడిటోరియం దద్దరిల్లేలా సందడి చేశారు. ఈ కార్యక్రమాలన్నింటిని ఫొటోలు, వీడియోలు తీస్తూ మరికొందరు కనిపించారు.

ఎంపీపీ సునీతకు పదవీ గండం

అవిశ్వాసం దిశగా వైసీపీ ఎంపీటీసీల అడుగులు

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): బుక్కరాయసముద్రం ఎంపీపీ దాసరి సునీతపై అవిశ్వాస తీర్మానానికి రంగం సిద్ధమైంది. వైసీపీకి చెందిన 13 మంది ఎంపీటీసీలు జడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్యను శుక్రవారం కలిసి తమ నిర్ణయాన్ని లిఖితపూర్వకంగా తెలియజేశారు. ఆయన పరిశీలించి, నిర్దేశిత ఫార్మాట్‌లో ఆర్డీఓకు పత్రాన్ని ఇవ్వాలని సూచించారు. అక్కడి నుంచి కలెక్టర్‌కు పంపుతారని, కలెక్టర్ ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీంతో ఆర్డీఓను శనివారం కలిసి ఎన్నికల నియమావళి ప్రకారం అవిశ్వాస తీర్మాన పత్రాన్ని ఇవ్వాలని నిర్ణయించారు. ఎంపీపీ స్థానం నుంచి దాసరి సునీతను తప్పించి, కాలువ వెంకటలక్ష్మిని ఎన్నుకోవాలని వారు భావిస్తున్నారు. ఎంపీపీ ఎన్నిక సమయంలో సునీత, వెంకటలక్ష్మి చెరీ రెండున్నరేళ్ల పదవిని చేపట్టేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. కానీ సునీత పదవిని వదులుకోవడానికి సిద్ధంగా లేకపోవడంతో సమస్య తలెత్తింది. ఆమెను దించేసేందుకు పలువురు ఎంపీటీసీలు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. నిబంధనల ప్రకారం నాలుగేళ్ల పదవీకాలం తరువాతే అవిశ్వాసం ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ లోగా ప్రభుత్వం మారడం, దాసరి సునీత టీడీపీలో చేరడంతో వైసీపీకి షాక్ తగిలింది. ఆమెను పదవి నుంచి దించేయాలని నిర్ణయించుకున్నారు. నాలుగేళ్ల పదవీకాలం శుక్రవారంతో ముగియడంతో అవిశ్వాసం దిశగా చర్యలు ప్రారంభించారు. బుక్కరాయసముద్రంలో 19 మంది ఎంపీటీలు ఉన్నారు. వీరిలో 13 మంది వైసీపీ, ఐదుగురు టీడీపీవారు ఉన్నారు. వైసీపీవారు మూకుమ్మడిగా వ్యతిరేకిస్తుండటం, టీడీపీ సభ్యులు సైతం సునీతపై అసంతృప్తితో ఉండటంతో అవిశ్వాసం పెడితే గట్టెక్కడం కష్టంగానే కనిపిస్తోంది. అధికారుల నిర్ణయంపై ఆమె భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. వైసీపీ ఎంపీటీసీలు తనను కలిశారని, నిబంధనల మేరకు ఆర్డీఓను కలవాలని సూచించానని డిప్యూటీ సీఈఓ తెలిపారు. ఆయనను కలిసి వారిలో వైసీపీ ఎంపీటీసీలు రాజేశ్వరి, సుజాత, పెద్దనాగప్ప, భాస్కర్ రెడ్డి, కుళ్లాయప్ప, నాగయ్య, శ్రీజ, రాజారెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

11వ శతాబ్దపు శాసనం గుర్తింపు

● పాతదేవరపల్లి చెన్నకేశవ ఆలయంలో గుర్తించిన రిటైర్డ్ హెచ్‌ఎం



పురాతన శాసనాన్ని పరిశీలిస్తున్న రిటైర్డ్ హెచ్‌ఎం వెంగన్న, గోపి

కొత్తచెరువు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాతదేవరపల్లి గ్రామ చెన్నకేశవస్వామి ఆలయంలో 11వ శతాబ్దానికి చెందిన శిలా శాసనం గుర్తించినట్లు విశ్రాంతి ప్రధానోపాధ్యాయుడు వెంగన్న, ఉపాధ్యాయుడు గోపి శుక్రవారం తెలిపారు. 11వ శతాబ్దంలో హొయసాల రాజు మొదటి విష్ణువర్ధన కాలంలో ఈ ఆలయం నిర్మించినట్లు వారు పేర్కొన్నారు. ఆలయంలో విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు 1511లో రాతిపై లిఖించిన శాసనంతోపాటు మరో నాలుగు శాసనాలు ఉన్నాయన్నారు. ఈ శాసనాలు తెలుగు, కన్నడ భాషల సమ్మిళితంగా ఉన్నాయని వారు తెలిపారు. ఈ ఆలయంలో చెన్నకేశవస్వామి విగ్రహం ప్రతి ఏడాది కొద్దికొద్దిగా పెరుగుతున్నట్లు గుర్తించామని వివరించారు. లక్ష్మీదేవి లింగరూపంలో పూజింపబడటం ఇక్కడి ప్రత్యేకత అని వారు తెలిపారు. ఈ ఆలయ నిర్వహణకు 125 ఎకరాల వ్యవసాయభూమిని రాజులు ఇచ్చారన్నారు. ఆ భూమి ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి ఉపయోగిస్తున్నట్లు పురోహితులు తెలిపారు.



రాయిపై లిఖించిన శాసనం

క్విజ్ పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్-2047 క్విజ్ పోటీలకు యువత దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన సంక్షేమశాఖ అధికారి రవిశంకర్ తెలిపారు. జనవరి 12 స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న యువత అక్టోబరు 1 నుంచి 15లోపు మై భారత్ ఆన్‌లైన్ పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. 15-29 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతీ, యువకులు అర్హులన్నారు. 12 భాషల్లో మల్టిపుల్ చాయిస్‌లో క్విజ్ పోటీలు ఉంటాయన్నారు. వివరాలకు సెల్ నంబరు 9849913062ను సంప్రదించాలని కోరారు. క్విజ్ పోటీలకు పేర్లను mybharat.gov.in/pages/vbyld వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

తప్పు చేయాలంటే భయపడాలి

● శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం: ఎస్పీ సతీష్‌కుమార్

హిందూపురం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): తప్పు చేసేవారెవరైనా పోలీసులను చూస్తే భయపడేలా చేస్తామని ఎస్పీ సతీష్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక వన్‌టౌన్‌పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్టవేయడానికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. డ్రోన్‌ల సాయంతో రాత్రివేళల్లో కూడా నేరస్తులను గుర్తించేందుకు త్వరలోనే శ్రీకారం చుడుతామన్నారు. గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. సోషల్ మీడియాలో తప్పుడు, రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జిల్లాలో అధిక వడ్డీ వసూలు చేసేవారు, భూకబ్జాలు, చీటింగ్ చేసేవారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. అక్రమ మద్యం, పేకాట నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. జిల్లాలో భూసమస్యలు అధికంగా ఉన్నాయని, అలా వచ్చిన వారికి అవగాహన కల్పించి రెవెన్యూ, కోర్టుకు వెళ్లేలా చర్యలు చేపడతామన్నారు. అంతకుముందు ఆయన సూగూరు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం సీఅండ్‌ఐజీ చర్చికి వెళ్లి ప్రార్థనలు నిర్వహించారు. అక్కడి నుంచి మసీదుకు వెళ్లి ప్రార్థన ల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ మహేష్, సీఐలు ఆంజనేయులు, జనార్దన్, అబ్దుల్ కరీంలు ఉన్నారు. హిందూపురానికి వచ్చిన జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ బంగ్లాలో డీఎస్పీ, సీఐలతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ సందర్భంగా హిందూపురం నియోజకవర్గంలో రాజకీయ ముసుగులో ఉన్న కొంతమంది నేరస్థులు, దందాలు చేసేవారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల తూమకుంట చెక్‌పోస్టులో జరిగిన బ్యాంకు దోపిడీ కేసుపై లోతుగా ఆరాతీశారు.

చోరీ కేసుల్లో ముగ్గురి అరెస్టు

● బంగారం, వెండి, కేబుల్ స్వాధీనం



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పలు చోరీ కేసుల్లో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. అందుకు సంబంధించిన వివరాలను స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఎస్పీ సతీష్‌కుమార్ శుక్రవారం వెల్లడించారు. మడకశిర మండలం యల్లోటి గ్రామానికి చెందిన విజయ్‌కుమార్, బోయ నరేష్, పెనుకొండ మండలం మరువపల్లికి చెందిన నరసింహుల మధ్య పరిచయం ఏర్పడింది. ముగ్గురూ కలిసి చోరీలు చేయాలనుకున్నారు. అందులో భాగంగా గత 11 నెలల్లో పెనుకొండ, రొద్దంలో ఆరు ఇళ్లలో చోరీలు చేశారు. బంగారు, వెండి ఆభరణాలను అపహరించారు. పొలాల్లో సైతం కేబుల్‌ను అపహరించారు. వీటిపై కేసులు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా పుట్టపర్తి క్రాస్ వద్దనున్న అభయాంజనేయస్వామి ఆలయ సమీపాన స్కూటీలో పారిపోతున్న నిందితులను వెంబడించి, పట్టుకున్నారు. వారి నుంచి రూ.15.30 లక్షల విలువచేసే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 13.2 గ్రాముల బంగారు ఆభరణాలు, 12.8 గ్రాముల వెండి, 770 మీటర్ల కేబుల్, స్కూటీ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరచిన ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, సిబ్బందిని అభినందించారు. సమావేశంలో డీఎస్పీ నర్సింగప్ప, సీఐ రాఘవన్ పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో జైలు శిక్ష

రొళ్ల, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): అత్యాచారం కేసులో మండలంలోని రంగనపల్లికి చెందిన సిద్దరాజుకు ఏడేళ్ల జైలు శిక్ష పడింది. రూ.5వేల జరిమానా కూడా విధిస్తూ అనంతపురం జిల్లా 4క్లాస్ అదనపు న్యాయాధికారి తీర్పు వెలువరించారు. కోర్టు కానిస్టేబుల్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సిద్దరాజు అలియాస్ సిద్దయ్యను 2018లో అత్యాచారం కేసులో పోలీసులు అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో వాదోపవాదాలు విన్న న్యాయాధికారి.. సిద్దరాజును ముద్దాయిగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించారు.

సంపులో పడి చిన్నారి మృతి

పరిగి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆడుకుంటూ వెళ్లిన మూడేళ్ల బాలుడు ధోని.. నీటి సంపులో పడి మృతిచెందాడు. ఈ విషాద సంఘటన పరిగి మండల పరిధిలోని ఊటకూరులో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఈశ్వర్, శిల్ప దంపతుల కుమారుడు ధోని... మధ్యాహ్నం 2గంటల సమయంలో ఇంటి వద్ద ఆడుకుంటూ వెళ్లి నీటి సంపులో పడ్డాడు. కుటుంబ సభ్యులు ఆలస్యంగా గమనించారు. వెలికితీసేలోగా మృతిచెందాడు.

చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం సీజనల్ చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.18వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి ధర రూ.13వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 328టన్నుల చీనీ కాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

వైద్యంలో నిర్లక్ష్యం.. పసివారి బలి

ఉరవకొండలో బాలుడు.. అనంతలో నవజాత శిశువు

ఆస్పత్రుల వద్ద బాధిత కుటుంబాల ఆందోళన



ఉరవకొండ సీహెచ్‌సీ వద్ద బాలుడి మృతదేహంతో ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు

అనంతపురం క్రైం/వైద్యం, ఉరవకొండ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఒకే రోజు ఇద్దరు పసివారు ఆస్పత్రుల్లో ప్రాణాలను పోగొట్టుకున్నారు. అనంతపురంలోని నవజాత శిశువు, ఉరవకొండ సీహెచ్‌సీలో ఐదేళ్ల బాలుడు శుక్రవారం మృతిచెందారు. దీంతో బాధిత కుటుంబాలవారు ఆందోళనకు దిగారు.

● వజ్రకరూరు మండలం చాబాల గ్రామానికి చెందిన రాజేష్, సవిత దంపతుల కుమారుడు అహరున్ కుమార్(5)కు జ్వరం రావడంతో గురువారం రాత్రి 11 గంటలకు ఉరవకొండ సీహెచ్‌సీకి తీసుకొచ్చారు. వైద్యుడు ఇస్మాయిల్ ఆస్పత్రి ఆవరణలోనే ఉన్నా.. బాలుడిని చూసేందుకు రాలేదు. సెలైన్ పెట్టాలని నర్సులకు సూచించాడు. బాలుడికి వారు సెలైన్ బాటిల్ ఎక్కించారు. తర్వాత ఎవరూ పట్టించుకోలేదు. అర్ధరాత్రి సమయంలో బాలుడు తీవ్ర అస్వస్థతకు లోనయ్యాడు. నర్సు దగ్గరకు వెళ్లి తల్లిదండ్రులు ప్రాధేయపడినా పట్టించుకోలేదు. దీంతో బాలుడు తెల్లవారుజామున మృతిచెందాడు. ఈ విషయాన్ని కూడా కుటుంబ సభ్యులే గుర్తించారు. కోపోద్రిక్తులై.. వైద్యుడు, సిబ్బందిని నిలదీశారు. తమ కుమారుడి మృతికి డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమంటూ ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని, వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. తమ కుమారుడి మృతికి కారణమైన వారిపై కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న డీసీహెచ్‌ఎస్ డేవిడ్ సెల్వరాజ్ విచారణ చేపట్టారు. విధుల్లో ఉన్న వైద్యుడు, నర్సులను వేర్వేరుగా విచారించారు. బాలుడి మృతిపై సమగ్ర విచారణ చేసి, నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆయన తెలిపారు.

అనంతలో అమ్మ ఆస్పత్రిపై దాడి..



బిడ్డను పోగొట్టుకుని.. అమ్మ ఆస్పత్రిలో విషాదంలో బాలింత

వైద్యుల నిర్లక్ష్యం వల్లే పుట్టిన శిశువు మరణించాడంటూ తల్లిదండ్రులు, బంధువులు అనంతపురం నగరంలోని అమ్మ ఆస్పత్రిపై శుక్రవారం రాత్రి దాడి చేశారు. అద్దాలు, ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. త్రీటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. నగరంలోని 5వ రోడ్డులోని హనుమాన్ కాలనీకి చెందిన చెందిన శిరీష ఈ నెల 20న అమ్మ ఆస్పత్రిలో మగ శిశువుకు జన్మనిచ్చారు. శిశువుకు ఊపిరితిత్తుల సమస్య వచ్చిందంటూ సాయినగర్‌లో ఉన్న హృదయ ఆస్పత్రికి తరలించారు. అక్కడ మూడు రోజులపాటు వైద్యం అందించారు. పరిస్థితి మెరుగవకపోవడం, డాక్టర్లు చేతులు ఎత్తేయడంతో ఈ నెల 24న ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో శుక్రవారం శిశువు మరణించాడు. వైద్యానికి రూ.4 లక్షల వరకూ ఖర్చు అయినా శిశువు మరణించడంతో బాధితుల కోపం కట్టలు తెంచుకుంది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందని కుటుంబ సభ్యులు, బంధువులు శుక్రవారం రాత్రి అమ్మ ఆస్పత్రి వద్దకు చేరుకుని, గొడవకు దిగారు. తాము చెప్పినట్లుగా ముందుగానే ఎందుకు సిజేరియన్ చేయలేదని, మీ నిర్లక్ష్యం వల్లే ఇదంతా జరిగిందని ఆస్పత్రి వర్గాలతో గొడవకు దిగారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం రేగి, దాడికి దారి తీసింది.

అమ్మాయిలు.. ఫుట్‌బాల్ చాంపియన్స్

రాష్ట్రస్థాయి టోర్నీ కైవసం.. బాలుర జట్టుకు తృతీయ స్థానం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 ఫుట్‌బాల్ అనంత అమ్మాయిలు అదరగొట్టారు. చాంపియన్‌గా అవతరించారు. జిల్లా బాలుర జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో గురువారం నిర్వహించిన ఫైనల్లో అనంత బాలికల జట్టు 3-0 గోల్స్ తేడాతో విశాఖట్నంపై గెలుపొంది, టోర్నీని కైవసం చేసుకుంది. జిల్లా జట్లు, కోచ్‌లు మారుతిప్రసాద్, జయప్ప, దాదా ఖలందర్, సుశీలను డీవీఈఓ నారాయణ నాయక్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, పీడీలు శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని అభినందించారు.



ట్రోఫీ అందుకుంటున్న జిల్లా బాలికల జట్టు

మచిలీపట్టణం ఎక్స్‌ప్రెస్ హిందూపురం వరకూ పొడిగింపు

గుంతకల్లు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మచిలీపట్టణం ఎక్స్‌ప్రెస్‌ను తాత్కాలికంగా హిందూపురం వరకూ పొడగించినట్లు రైల్వే అధికారులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ధర్మవరం వరకూ వెళ్తున్న ఈ రైలును నవంబరు మూడో వారంలో హిందూపురం వరకూ గమ్యస్థానాన్ని పెంచనున్నట్లు తెలియజేశారు. మచిలీపట్టణం-హిందూపురం (17215) రైలును నవంబరు 20నుంచి 26వ తేదీ వరకూ నడపనున్నామన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 17216) నవంబరు 21నుంచి 27వతేదీ వరకూ హిందూపురం నుంచి బయలుదేరుతుందన్నారు. ఈ రైలు సత్యసాయి ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్‌లోనూ నిలుస్తుందన్నారు.

డీజీపీని కలిసిన ఎంపీ అంబికా

అనంతపురం క్రైం, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తాను మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాకు సంబంధించి పలు విషయాలను డీజీపీ అడిగి తెలుసుకున్నట్లు ఎంపీ తెలిపారు.



డీజీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ అంబికా

టమోటా కిలో రూ.18

అనంతపురం రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శుక్రవారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.18తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠ ధర రూ.10వేలు, సరాసరి ధర రూ.14తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2,550టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా చర్యలు: కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు వచ్చే పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం 62వ జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామికరంగాన్ని ప్రోత్సహించేలా పారిశ్రామికవేత్తలను ఆహ్వానించి వారికి సకాలంలో సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా అన్ని రకాల అనుమతులను ఇవ్వాలన్నారు. తిమ్మసముద్రం, ఊరిచింతల, కూడేరు ప్రాంతాల్లో కొత్తగా ఏర్పాటు చేయనున్న ఎంఎస్‌ఎంఈ పారిశ్రామికవాడలను త్వరగా అభివృద్ధి చేయాలని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌ను ఆదేశించారు. పీఎంఈజీపీ పథకం ద్వారా అర్హులైన వారి నుంచి నాణ్యత గల పథకాలను ఎంపిక చేయాలని పరిశ్రమల అధికారిని ఆదేశించారు. స్టాండప్ ఇండియా పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి విరివిగా రుణాలు మంజూరు చేయించాలని ఎల్‌డీఎంను ఆదేశించారు. రాయదుర్గంకు చెందిన పారిశ్రామికవేత్తకు స్థల సేకరణ చేయాలని పరిశ్రమల అధికారిని ఆదేశించారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పిస్తాం

జిల్లా కేంద్రం నుంచి గ్రామ స్థాయి వరకు జీఎస్టీ రేట్ల తగ్గింపు ప్రయోజనాలపై సామాన్య ప్రజలకు సైతం అవగాహన కల్పించేవిధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ జిల్లా కలెక్టర్లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఆనంద్, పన్నుల శాఖ, జీఎస్టీ, ఏపీ ఎస్పీడీసీఎల్, నెడ్‌క్యాప్ శాఖల అధికారులు పాల్గొన్నారు. పలు అంశాలపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పీఎం కుసుం పథకానికి సంబంధించి 20 విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో 111మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ల పనులను పూర్తి చేయటానికి అవసరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఆయా సమావేశాల్లో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాస్ యాదవ్, అసిస్టెంట్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, రవాణా శాఖ అధికారి వీర్రాజు, జెడ్‌ఎం దేవకాంతమ్మ, ఎల్‌డీఎం నరేష్‌రెడ్డి, పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ భాస్కర్‌వల్లి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ శేషాద్రి, నెడ్ క్యాప్ అశోక్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్

విశ్వశాంతి కోసం..

పుట్టపర్తి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): విశ్వశాంతిని కాంక్షిస్తూ ప్రశాంతినిలయంలో వేదపండితులు యజ్ఞాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఉదయం 8గంటలకు సాయికుల్వంతు సభామండపంలో సత్యసాయి మహాసమాధి వద్ద వేదపండితులు కలశపూజ నిర్వహించారు. మంగళవాయిద్యాలు, బ్యాండ్‌మేళాలతో కలశాన్ని తీసుకుని ర్యాలీగా యజ్ఞం వేదిక అయిన పూర్ణచంద్రహాల్‌కు చేరుకున్నారు. విద్యార్థులు, వేదిపండితులు వేదమంత్రోచ్ఛరణ చేస్తుండగా పండితులు వేదపురుష సప్తాహ జ్ఞాన యంత్రాన్ని ప్రారంభించారు. యజ్ఞంలో మొదట గణపతి పూజ నిర్వహించారు. పండితులు శివలింగార్చన చేశారు. సర్వదేవత అవాహన చేస్తూ యజ్ఞాన్ని కొనసాగించారు. మొదటి రోజు యజ్ఞాన్ని తిలకించడానికి వేలాది మంది భక్తులు పూర్ణచంద్రహాల్‌కు చేరుకున్నారు. దసరా ఉత్సవాలలో భాగం గా ప్రతిఏడాది యజ్ఞాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. వారం రోజులపాటు యజ్ఞం నిర్వహించనున్నారు.



యజ్ఞం చేస్తున్న పండితులు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

రాజారామ్ మోహన్ రాయ్ (వర్ధంతి)



సంఘసంస్కర్త రాజారామ్ మోహన్‌రాయ్ 1772 మే 22న బెంగాల్ ప్రాంతంలో జన్మించారు. బ్రిటీషుల కాలంలోనే అప్పటి సతీ సహగమనం, బాల్య వివాహాల సాంఘిక దురాచారానికి అడ్డుకట్ట వేసేందుకు శ్రమించారు. వితంతు పునర్వివాహం, స్త్రీ విద్యకు పాటుపడ్డారు. బ్రహ్మసమాజాన్ని ఏర్పాటు చేశారు. బెంగాల్ సాంస్కృతిక పునరుజ్జీవనంలో ముఖ్యులుగా గుర్తింపు పొందారు. 1833 సెప్టెంబరు 27న కన్నుమూశారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ (జయంతి)



నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ విముక్తి పోరాటంలో చురుగ్గా పాల్గొన్న నాయకులలో ఒకరైన కొండా లక్ష్మణ్ బాపూజీ 1915 సెప్టెంబరు 27న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాంకిడిలో జన్మించారు. ప్రత్యేక తెలంగాణ కోసం మూడు దశల ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించారు. 1969లో తొలిదశ పోరాటంలో కీలకంగా ఉండి మంత్రి పదవిని కూడా త్యజించిన త్యాగశీలి. వాంకిడిలో లక్ష్మణ్ సేవాసదన్ స్వచ్ఛంద సంస్థ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగించారు. 97వ యేట 2012 సెప్టెంబరు 21న కన్నుమూశారు.

పుగళేంది (జయంతి)



ప్రముఖ సంగీత దర్శకుడు పుగళేంది 1929 సెప్టెంబరు 27న త్రివేండ్రంలో జన్మించారు. అసలు పేరు వేళప్పన్ నాయర్. గురువు కేవీ మహదేవన్‌తో కలసి 15ఏళ్లలో 600 తమిళ, తెలుగు, మళయాళ సినిమాలకు పనిచేశారు. దక్షిణాదిన భక్తి పాటలకు ఆయన ప్రత్యేకం అనిపించారు. 2005 ఫిబ్రవరి 27న కన్నుమూశారు.

నగేష్ (జయంతి)




దక్షిణాది ప్రముఖ హాస్యనటుడు నగేష్ 1933 సెప్టెంబరు 27న తమిళనాడులోని ధారాపురం ప్రాంతంలో జన్మించారు. ఆయన పూర్వీకులు తుమకూరు జిల్లా తిపటూరు తాలూకా చెయ్యూరు ప్రాంత వాసులు. ఆయన అసలు పేరు గుండూరావు. చిన్నప్పుడే ఏదో ఒక రంగంలో తన ప్రతిభ చాటుకున్నాకే తిరిగి వస్తానని మద్రాస్ చేరుకున్నారు. రైల్వే కొంతకాలం పనిచేసి ఆపై నాటక రంగం నుంచి సినీరంగంలోకి ప్రవేశించారు. నవ్విస్తూనే ఏడిపించేవారాయన. అందుకే దక్షిణాది చార్లీ చాప్లిన్‌గా అభివర్ణిస్తుంటారు. తెలుగు, తమిళ, మళయాళ, కన్నడ భాషల్లో సుమారు వెయ్యికిపైగా సినిమాల్లో నటించారు. చివరగా కమలహాసన్ హీరోగా చేసిన ఎదశావతారర్ సినిమాలో నటించారు. కళైమామణి, నేషనల్ ఫిల్మ్ అవార్డు తదితర పురస్కారాలు అందుకున్నారు. 2009 జనవరి 31న కన్నుమూశారు.

జి. వరలక్ష్మి (జయంతి)



జీ వరలక్ష్మిగా సుపరిచితరాలైన గరికిపాటి వరలక్ష్మి 1926 సెప్టెంబరు 27న ఒంగోలులో జన్మించారు. రంగస్థల, సినిమా నటి, గాయనీమణి, నిర్మాత, దర్శకురాలు. 1940 - 60లమధ్య తెలుగు, తమిళ సినీరంగాలలో పేరొందారు. సక్కుబాయి, రంగూన్‌రౌడీ నాటకాలు ఎంతో పేరొందాయి. బాలనటిగా బారిష్టరు పార్వతీశం సినిమాతో సినీరంగంలోకి అడుగుపెట్టారు. మూడు దశాబ్దాలకుపైగా రాణించారు. 1968లో ఎమూగజీవులు చిత్రానికి దర్శకత్వం వహించారు. 2006 నవంబరు 26న కన్నుమూశారు.

యశ్ చోప్రా (జయంతి)



ప్రముఖ హిందీ దర్శక, నిర్మాత యశ్ చోప్రా 1932 సెప్టెంబరు 27న జన్మించారు. యశ్ రాజ్ ఫిల్మ్స్ ప్రొడక్షన్స్ అండ్ డిస్ట్రిబ్యూషన్ స్థాపకులు. ఐదు దశాబ్దాలలో 50కుపైగా సినిమాలు నిర్మించారు. ఎందరో నటులకు అవకాశం కల్పించారు. 6 జాతీయ, 11 ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు, గౌరవ డాక్టరేట్‌లతోపాటు పద్మభూషణ్, దాదాసాహెబ్‌ఫాల్కే పురస్కారాలు అందుకున్నారు. 2012 అక్టోబరు 21న కన్నుమూశారు.

మాతా అమృతానందమయి (పుట్టినరోజు)



హిందూ ఆధ్యాత్మిక గురువు మాతా అమృతానందమయి 1953 సెప్టెంబరు 27న కేరళలో జన్మించారు. ఎఅమ్మగా పిలవబడుతూ మానవతావాదిగా గుర్తింపు పొందారు. మాతా అమృతానందమయి మఠం ఏర్పాటు చేసి ఏటా కోటిమందికి ఉచిత భోజనం సమకూరుస్తున్నారు. ఐక్యరాజ్య సమితిలో ప్రసంగించారు. దేశవ్యాప్తంగా వరదబాధితులు, నిరుపేదలకు 47వేల ఇళ్లను నిర్మించి ఇచ్చారు. విద్యాసంస్థలు, ఆసుపత్రులు కట్టించారు. 35భాషలలో వెయ్యికిపైగా భజనలు రాసి రికార్డు నెలకొల్పారు. విశ్వరత్న పురస్కారం అందుకున్నారు.

ఆనంద శంకర్ జయంత్ (పుట్టినరోజు)



భరతనాట్య కళాకారిణి పద్మశ్రీ ఆనంద శంకర్ జయంత్ 1961 సెప్టెంబరు 27న తిరునల్వేలిలో జన్మించారు. దక్షిణ మధ్య రైల్వేలో రైల్వే ట్రాఫిక్ సర్వీసులో తొలి మహిళా అధికారిని. 1972 నుంచి నృత్యరంగంలో తనదైన ప్రతిభతో గురువు, వక్త, కొరియోగ్రాఫర్‌గా, పండితురాలిగా రాణించారు. హైదరాబాద్‌లో 'శంకరానంద కళాక్షేత్ర 'డ్యాన్స్‌స్కూల్ ఏర్పాటు చేశారు. నాట్య ఇళవరసి, నృత్య చూడామణి, కళైమామణి, కళారత్న తదితర గౌరవాలు అందుకున్నారు. 2009లో కేన్సర్‌పై ఆమె ప్రసంగాలు ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలిచాయి. రెండేళ్ల అనంతరం కేన్సర్‌ను జయించి ప్రస్తుతం సాధారణ జీవితం గడుపుతున్నారు.

మహాలక్ష్మీ నమోస్తుతే..!



సీతారామాశ్రమంలో అన్నపూర్ణాదేవి అలంకారం



అలంకరణలో మహంకాళి



బెంకి మారెమ్మ



నిర్దల ఆంజనేయస్వామి



చేళూరులో వాసవీమాతకు 108 రకాల నైవేద్యం



బాగేపల్లిలో విశేష పూజల్లో భక్తులు



శిడ్లఘట్టలో గాయత్రీదేవికి మహాలక్ష్మి అలంకరణ



బనశంకరి మాతకు గాజుల అలంకరణ



నాగరభావి కేకే లే అవుట్‌లో కెంచలమ్మదేవికి అన్నపూర్ణదేవి



గిరినగర్ వాసవీమాతకు గజలక్ష్మి అలంకరణ



ముళబాగిలు ముత్యాలపేట గంగమ్మదేవి



వేమూరు వాసవీమాతకు అన్నపూర్ణేశ్వరీ అలంకరణ

బెంగళూరు, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రులలో ఐదోరోజు శుక్రవారం బెంగళూరు నగరంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఆలయాలలో విశేష పూజలు కొనసాగాయి. నగరంలోని బనశంకరి ఆలయంలో అమ్మవారికి గాజుల అలంకరణ నిర్వహించారు. సాధారణంగా శుక్రవారం ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. దసరా కావడంతో మరింత అధికంగా ఉంది. భక్తులు నిమ్మకాయల దీపాలు వెలిగించి జ్యోతి ప్రజ్వలన చేశారు. మల్లేశ్వరంలోని కన్యకా పరమేశ్వరీదేవి ఆలయం, గంగమ్మ దేవి ఆలయం, విద్యారణ్యపుర కాళికాదుర్గా పరమేశ్వరి తదితర ఆలయాలలో విశేషపూజలు కొనసాగాయి. మైసూరు చాముండిదేవి వారాహి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

బళ్ళారి నగరంలో...

బళ్లారి సిటీ/సిరుగుప్ప/కంప్లి, (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ఆలయాల్లో అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. నగరంలోని సిరుగుప్ప రోడ్డు హంబావి కాలనీలోని శ్రీరామాశ్రమంలో దేవికి అన్నపూర్ణఅలంకారంతో భక్తులకు దర్శనం ఇచ్చింది. అలాగే నగరంలోని పటేల్‌నగర్‌లోని చిన్నదుర్గమ్మ ఆలయంలో దుర్గమ్మ మహాలక్ష్మి అవతారం.కన్యాకాపరమేశ్వరీ ఆలయంలో వాసవీదేవికి ధనలక్ష్మి అలంకారం. నగరంలోని అనంతపురం రోడ్డు నేకారుల కాలనీలో 12వ సంవత్సర శరన్న మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. భక్తులకు మధ్యాహ్నం భోజన వసతి కల్పించారు. ఇందులో రాజు, గోపాల్,నాగురాజు,రంగస్వామి, మల్లి భక్తులకు అన్నపసాదాలు పంపిణీ చేశారు.







కంప్లి బసవేశ్వర ఆలయంలో.. షుగర్ ఫ్యాక్టరీలో.. హంపిలో..



మైసూరు చాముండీదేవికి వారాహి అలంకరణ



దొడ్డజాల ముత్యాలమ్మదేవికి వైష్ణోదేవి అలంకరణ



చింతామణి మిండిగల్ చౌడేశ్వరీ దేవి

దసరా వేళ బొమ్మల విక్రయాలు



బొమ్మలతో నటి కవితాగౌడ

బెంగళూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దసరా అంటే బొమ్మలకొలువు, మైసూరు ఉత్సవాలు, అమ్మవార్లకు అలంకరణలకు ప్రత్యేకం. దసరా వేళ వివిధ రకాల బొమ్మలతో చిత్రకళాపరిషత్ మరింత ఆకర్షణీయం అనిపిస్తోంది. దసరా కోసం ఏర్పాటు చేసిన బొమ్మలకొలువు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటోంది. బెంగళూరు ఉత్సవ్ పేరిట ఏర్పాటు చేసిన ప్రదర్శనలను మోడల్, నటి కవితాగౌడ శుక్రవారం ప్రారంభించారు.

పత్రికల ఏజెంట్ల కోసం ఓ భవనం



పత్రికల ఏజెంట్ల సంఘం వార్షికోత్సవంలో ఎమ్మెల్యే విశ్వనాథ్

హామీ ఇచ్చిన ఎమ్మెల్యే విశ్వనాథ్

బెంగళూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): యలహంకలో పత్రికల ఏజెంట్లకోసం ఓ ప్రత్యేకమైన షెడ్‌లాంటి భవనాన్ని నిర్మిస్తానని ఎమ్మెల్యే విశ్వనాథ్ హామీ ఇచ్చారు. స్థానిక పత్రికా ఏజెంట్ల అసోసియేషన్ 12వ వార్షికోత్సవం గురువారం జరిగింది. స్థానికంగా 30మంది ఏజెంట్లు ప్రతి రోజూ పత్రికలను అమర్చుకునేందుకు ఇబ్బంది పడుతున్నట్టు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. మినీ విధానసౌధ పక్కన ప్రత్యేకమైన షెడ్ ఏర్పాటు చేయిస్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏజెంట్లు మంజునాథ్, వీరభద్ర, శంకర్, రాజశేకర్‌రెడ్డి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ఆలయంలో ప్రతి భక్తుడికి సౌకర్యాలు

స్థానిక కమిటీ చైర్మన్ కనకమేడల వీర



బాధ్యతలు స్వీకరిస్తున్న కనకమేడల వీర

బెంగళూరు, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): వయ్యాలికావల్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆలయాన్ని సందర్శించే ప్రతి భక్తుడికి ప్రశాంత వాతావరణంతోపాటు సౌలభ్యాలు కల్పించేందుకు కట్టుబడ్డామని లోకల్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ కనకమేడల వీర తెలిపారు. శుక్రవారం టీటీడీ ఆలయంలో కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని అనంతరం బాధ్యతలు తీసుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ జయంతి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వీర మాట్లాడుతూ ప్రస్తుతం తిరుమలలో నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతున్నందున తదుపరి బెంగళూరు ఆలయంలో చేపట్టే కార్యక్రమాలపై అధికారులతో చర్చిస్తామన్నారు. కమిటీలో 19-20 మంది సభ్యులకు అవకాశం ఉంటుందని, వారిని నియమించే ప్రక్రియ మరో నెలరోజులు కావచ్చునన్నారు. తిరుమలలో జరిగే ప్రతి కార్యక్రమం వయ్యాలికావల్ ఆలయంలోనూ జరుగుతుందన్నారు. బెంగళూరుతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉండే భక్తులను ఆకర్షించేలాంటి పూజలు తదితర కార్యక్రమాలు, ఇక్కడి సౌలభ్యా లపై విస్తృతంగా ప్రచారం చేయదలిచామన్నారు. ప్రతి భక్తుడు ప్రశాంతంగా స్వామివారి దర్శనం చేసుకోవాలనేది మా ఆశయమన్నారు. అందుకోసం రానున్న రోజుల్లో మరింత భక్తిభావాన్ని పెంపొం దింపచేస్తామన్నారు. ప్రస్తుతం ఆలయంలో ప్రతి రోజూ అన్నదానం ఉంటుందని అయితే దాతలు లేనప్పుడు ఒక్కోసారి ఒకటి రెండురోజులు అమలు చేయలేకపోతున్నట్టు తెలుసుకున్నామన్నారు. నిరంతరంగా అన్నదానం కొనసాగించాలని ఆలోచిస్తున్నా మన్నారు. బెంగళూరులో సుదీర్ఘకాలంగా నివసించానని ఇక్కడి పరిస్థితులు సంపూర్ణంగా తెలుసు అన్నారు. ఒక ఆశయం కోసం టీడీపీ ఫోరం సంస్థను ఏర్పాటు చేసి ఎన్నో కార్యక్రమాలు అమలు చేశామన్నారు. ప్రస్తుతం దేవుడి వద్ద సేవ చేసే అవకాశం దక్కిందన్నారు. ఫోరం సభ్యులు ఇక్కడి కార్యక్రమాలలో భాగస్వామ్యులు అవుతా రన్నారు. సమిష్టిగా భక్తులకు అనుకూలమైన వాతావరణం తీసుకొస్తామన్నారు. టీటీడీ బోర్డు సభ్యుడు నరేశ్‌కుమార్, రాజరాజేశ్వరినగర్ ఎమ్మెల్యే ము నిరత్న, కర్ణాటక తెలుగు అకాడమీ అధ్యక్షులు ఆర్‌వీ హరీశ్, పత్తిపాటి ఆంజనేయులు, రాజేంద్ర నాయుడుతోపాటు ఫోరం ముఖ్యులు సోంపల్లి శ్రీకాంత్, పాండు, శివ, కేశవ, నారాయణ, వినోద్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. ధర్మప్రచార పరిషత్ సభ్యుడు భుజంగరావ్, దాస సమ్మిళిన అధ్యక్షులు దాస సుబ్రమణ్య తదితరులు ఉన్నారు.

మహిళల స్వావలంబనకు ప్రాధాన్యం

శిడ్లఘట్ట, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ధర్మస్థల గ్రామాభివృద్ధి సంస్థ కార్యాలయంలో శుక్రవారం దసరా పూజలు నిర్వహించారు. సంస్థ చిక్కబళ్ళాపుర జిల్లా డైరెక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ.. విద్య ద్వారా మౌలిక సదుపాయాలు పెంచడంతోపాటు మహిళల స్వావలంబనకు సంస్థ కృషి చేస్తోందన్నారు. చిక్కబళ్ళాపుర జిల్లాలోని పాఠశాలలకు 494 బెంచీలు, డెస్కులు సిద్ధం చేశామని అక్టోబరులో అందచేయనున్నట్టు తెలిపారు. ఈనెల 28న వాసవి కల్యాణమండపంలో మహిళా విచారగోష్టి ఉంటుందని ముఖ్యఅతిథిగా సహనా రాజీవ్‌గౌడ పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో శిడ్లఘట్ట యోజనాధికారి ప్రసాద్, జ్ఞానవికాస సమన్వయాధికారి అరుణ్, జిల్లా జనజాగృతి వేదిక సభ్యుడు సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



ధర్మస్థల గ్రామాభివృద్ధి కార్యాలయంలో దసరా పూజ

నగరంలో క్యాన్సర్‌పై జాగృతి

బెంగళూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): బెంగళూరు ట్రాఫిక్ పోలీసులతో కలసి డీకేఎంఎస్ ఫౌండేషన్ బ్లడ్ క్యాన్సర్, ఇతర రక్త సమస్యలు తలసేమియా, ఎప్లాస్టిక్ అనీమియా వంటివాటిపై జాగృతి కల్పించారు. ట్రాఫిక్ మేనేజిమెంట్ సెంటర్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో ఈ సందర్భంగా పోలీసు సిబ్బందికి స్టెమ్ సెల్ డొనేషన్‌పై నమోదు ప్రక్రియ వివరించారు. అవసరమైన రోగులకు బ్లడ్ స్టెమ్‌సెల్ దాతల సహకారంపై వివరించారు. వందమందికిపైగా పోలీసులు పాల్గొన్నారు. డీకేఎంఎస్ సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ప్యాట్రిక్‌పాల్ మాటాడుతూ బెంగళూరు ట్రాఫిక్ పోలీసుల సేవలు తమ సేవకు పేరొందారన్నారు. ప్రస్తుతం బ్లడ్‌స్టెమ్‌సెల్, ఇతర బాధితులకు జీవం పోసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. వారి నిర్ణయం ఇతరులకు మాదిరిగా ఉందన్నారు. ట్రాఫిక్ పోలీసులకు వెయ్యి రిఫ్లెక్టివ్ జాకెట్‌లను అందచేసింది.



ట్రాఫిక్ సిబ్బందికి రిఫ్లెక్టివ్ జాకెట్ అందజేస్తున్న దృశ్యం

సర్జాపురలో శుద్ధ తాగునీటి కేంద్రాలు

దొమ్మసంద్ర, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా సర్జాపుర పట్టణంలోని బస్టాండ్, సర్జాపుర పోలీస్‌స్టేషన్ ముందు భాగాన, చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానం వద్ద నిర్మించిన శుద్ధ తాగునీటి కేంద్రాలను ఎమ్మెల్యే శివణ్ణ శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. సర్జాపుర గ్రామపంచాయతీ అధ్యక్షురాలు డాక్టర్ ఎన్ కళావతి మూర్తికుమార్ ముఖ్యులుగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతప్రజల ఆరోగ్యదృష్ట్యా శుద్ధతాగునీటి కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కళావతి మాట్లాడుతూ సర్జాపుర అంబేడ్కర్ కాలనీలో రాజకాలువ అభివృద్ధికి నోచుకోకపోవడంతో స్థానికులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని, దీన్ని పరిష్కరించేందుకు నిర్మాణాలకు భూమిపూజ చేశామన్నారు. సమగ్ర అభివృద్ధికి తమవంతు కృషి చేస్తున్నామని ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ మాజీ ఉపాధ్యక్షుడు, సభ్యుడు ఏ సతీశ్‌కుమార్, విజయ్‌శేఖర్, కిటకి శ్రీనివాస్, అభివృద్ధి అధికారి సుభాన్‌ఖాన్, కార్యదర్శి నంజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తాగునీటికేంద్రం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే తదితరులు

వానరం సందడి..



ఆటలాడుకుంటున్న వానరం

దసరా వేళ... బొమ్మల కొలువులు చూస్తాం. నిత్యం చిత్రకళలు, వస్తు ప్రదర్శనలతో రద్దీగా ఉండే చిత్రకళాపరిషత్‌లో ఓ వానరం బొమ్మతో ఆడుకుంటుడడం ప్రత్యేకం అనిపించింది. శుక్రవారం ఉదయం వానరం బొమ్మతో ఆడుకుంటున్న ఫోటో ఆకట్టుకుంది. (బెంగళూరు, ఆంధ్రజ్యోతి).

స్లీపర్ కోచ్ బస్ బోల్తా

రాయచూరు సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): దావణగెరా నుంచి రాయచూరు వస్తున్న స్లీపర్ కోచ్ బస్ ఒకటి అదుపు తప్పి బోల్తా కొట్టింది. శుక్రవారం తెల్లవారు జామున నగర సమీపం సీథ్‌మైల్ క్రాస్ వద్ద జరిగిన ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న 15 మంది ప్రయాణికులకు గాయాలైయ్యాయి. ఒక్కరి కాలు విరిగిపోగా మరో 14 మందికి గాయాలు కావడంతో వారిని చికిత్స కోసం రిమ్స్ ఆస్పత్రిలో చేర్చారు. వేగంగా వస్తున్న బస్సు డ్రైవర్ కుక్కను తప్పించబోయి ప్రమాదం బారిన పడినట్లు బస్సులో ప్రయాణిస్తున్న వారు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి వర్షం కురుస్తున్న నేపథ్యంలో గాయపడిన ప్రయాణీకులను రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. వీరికి స్థానికులు తెల్లవారుజామున దగ్గరుండి సహాయం అందించి మానవత్వం చాటుకున్నారు.



సహాయక చర్యల్లో పోలీసులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1,631.84
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	14.048	11,368
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	13,792	12,033
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	101.15

కార్ల దొంగ గాలింపునకు
ప్రత్యేక బృందం

- దాదాపు 70 వాహనాలు హాంఫట్
- మరిన్ని ఫిర్యాదులు వచ్చే అవకాశం
- విచారణలో తేలనున్న నిజాలు : ఎస్పీ



ఎస్పీ శోభారాణి

బళ్లారి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) కార్లను అద్దెకు తీసుకుని, అద్దె ఎగ్గొట్టడమే కాకుండా కార్లను మాయం చేస్తున్న ఘరానా మోసగాడు ఎండీ జవేద్ బాష అలియాస్ సోనును అరెస్టు చేయడానికి ప్రత్యేక పోలీస్ బృందాన్ని నియమించినట్లు ఎస్పీ శోభారాణి తెలిపారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. రాయచూరు జిల్లా సింధనూరు కు చెందిన ఎండీ జవేద్‌బాష(సోను)కార్లను అద్దెకు తీసుకుని మాయం చేశాడని బళ్లారి బ్రూస్‌పేట్ పోలీస్టేషన్లలో సయ్యద్ సాద్రు, కౌల్‌బజార్ పోలీస్టేషన్లలో ముక్తాల్ అమ్మద్ అనే బాధితులు ఫిర్యాదు చేశారు. ఎస్పీ తెలిపిన వివరాల మేరకు జవేద్ బాష సివిల్ పనులు సాగే ఏరియాలో తిరిగేందుకు అద్దెకు కార్లు కావాలని ఓనర్లను కోరారు. నెలకు డ్రైవర్, డీజల్ అన్నీ తామే భరించి రూ. 50 వేలు చెల్లిస్తామని ఆశ చూపాడు. ప్రస్తుతం బళ్లారి బ్రూస్‌పేట పోలీస్టేషన్‌లో 47, కౌల్ బజార్ పోలీస్టేషన్‌లో 10, గాంధీనగర్ పోలీస్టేషన్‌లో 11 కార్ల ఓనర్లు ఫిర్యాదు చేశారని, ఇంకా బాధితులు సంఖ్య పెరుగుతుందని ఎస్పీ అన్నారు. రాయచూరు, సింధనూరు, విజయనగర, బళ్లారి జిల్లాలో అత్యధికంగా బాధితులు ఉన్నారన్నారు. దాదాపు వంద మంది బాధితులు ఉంచే అవకాశం ఉందన్నారు. విచారణలో పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు. కార్ల కంపెనీలో బాడుగకు ఉన్నాయా.? స్క్రాప్‌కు ఇచ్చేశారా అనేది విచారణలో తేలుతుందన్నారు.

దుబాయ్‌కి ఉడాయించిన జవేద్..!

కార్లను అద్దెకు తీసుకుని డబ్బులు చెల్లించకుండా మోసం చేసిన జవేద్ దుబాయ్‌కు ఉడాయించాడనే వార్తలు వినిపిస్తున్నాయి. గత వారం క్రితమే అతను దుబాయ్‌కు వెళ్లి పోయినట్లు సమాచారం. పాస్‌పోర్టు ఆదారంగా అతను ఎక్కడ ఉండేది, ఏ దేశం వెళ్లింది పోలీసులు విచారణ చేస్తున్నారు. కొద్ది రోజులు పోలీసుల బృందం సోను కోసం వెతికి కనిపించ కుండా పోతే లుక్‌ఔట్ నోటీస్ జారీ చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. అతను వాడుతున్న సెల్‌ఫోన్ సిమ్ ద్వారా అతని స్నేహితులు, కుటుంబసభ్యుల ద్వారా సోను వివరాలు సేకరించేందుకు పోలీసులు ప్రయత్నం చేస్తున్నారు.

సామాజిక సర్వే పకడ్బందీగా చేపట్టాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధికారి నాగేంద్ర ప్రసాద్

బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటికే ప్రారంభమైన వెనుకబడిన వర్గాల సామాజిక సర్వేలో గణతిదారులు, సూపర్‌వైజర్‌లు, మాస్టర్ ట్రైనర్స్, బిఇఓలు క్రమం తప్పకుండా పాల్గొని విజయవంతం చేయాలని జిల్లాధికారి నాగేంద్ర ప్రసాద్ అధికారులకు సూచించారు. శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ కార్యాలయంలో సభాంగణంలో జిల్లాలో వెనుకబడిన వర్గాల సామాజిక సర్వేపై ప్రగతి సభను ఉద్దేశించి మాట్లాడారు. జిల్లాలో సర్వే కార్యక్రమానికి నియమించిన సిబ్బందిలో ఉపాధ్యాయులు, అంగనవాడీ కార్యకర్తలు ఇళ్ళవద్దకు వెళ్ళడం లేదనే ఆరోపణలు వస్తున్నాయని, సంబంధిత అధికారులు వెంటనే సిబ్బందికి సూచనలు ఇవ్వాలని, లేకపోతే అలాంటి వారిపై చర్యలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

గ్రామ సహాయకుల ద్వారా ఏర్పాట్లు

గ్రామీణ ప్రాంతాల్లో సర్వే కార్యక్రమానికి, ఇళ్ళ గుర్తింపుకు వెళ్ళిన సిబ్బందికి ఎలాంటి సమస్య తలెత్తకుండా భోజనం, తాగునీరు, లాంటి సౌకర్యాలు అందించేందుకు ఆయా గ్రామసహాయకులు అండగా ఉంటారన్నారు. సమీక్షా కార్యక్రమానికి వెళ్ళే గణిత దారులు మొబైల్ లాగిన్ సందర్భంలో ఎలాంటి సాంకేతిక పరమైన సమస్యలు తలెత్తినా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కులగణన ప్రక్రియ నిర్వహిస్తున్న నేపథ్యంలో పాఠశాలలకు ఎలాంటి సేవలు లేవని, సిబ్బంది తప్పకుండా కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. గ్రామీణ ప్రాంతంలో మొబైల్ నెట్ వర్క్ సమస్యలు తలెత్తితే ఆయా గ్రామ పంచాయతీ వ్యాప్తిలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా పరిధిలో సండూరు తాలూకా తోరణగల్లు గ్రామం జిందాల్ టౌన్‌షిప్, వడ్డు, శంకరగుడ్డ, కాలనీలో సమీక్ష దారులకు ప్రవేశానికి కంపెనీ ప్రతినిధులకు ఆదేశాలు జారీచేయాలని తహసీల్దార్‌కు సూచించారు. జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి మహ్మద్ హ్యారీస్ సుమైర్, జిల్లా సహాయాధికారి ఎన్.ఝుబేర్, జిల్లా పంచాయతీ ఉప కార్యదర్శి శశికాంత శజవపూర, వెనుకబడినవర్గాల సంక్షేమ అధికారి జాలాలప్ప, డీఎంఎఫ్ అధికారి లోకేష్, సాంఘీక సంక్షేమ శాఖ అధికారి చిదానందప్ప, ఎస్టీ వర్గాల సంక్షేమ శాఖ అధికారులతో వివిధ శాఖల అధికారులు, వర్చువల్ ద్వారా అన్ని తాలూకా తాహసీల్దారులు, ఈఓలు, పీడీఓలు పాల్గొన్నారు.

పర్యాటకంలో ఖ్యాతి గడించిన బళ్లారి : ఏడీసీ



బళ్లారి ఏకశిల కొండపై వారసత్వ నడకలో ఏడీసీ మహ్మద్ జుబేర్

బళ్లారి సిటీ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లా కేవలం మైనింగ్ ప్రాంతం మాత్రమే కాదని, భారతీయ పురావస్తు వారసత్వ జాబితాలో చేర్చబడిన ముఖ్యమైన పర్యాటక ప్రదేశాలు కూడా ఇందులో ఉన్నాయని జిల్లా అదనపు కలెక్టర్ మహమ్మద్ జుబేర్ అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం నగర చారిత్రాత్మక కోట ఆవరణ ప్రవేశ ద్వారం వద్ద జిల్లా యంత్రాంగం, జిల్లాపంచాయతీ, జిల్లాపర్యాటక శాఖ, హోటల్ యజమానుల సంఘం. రాబర్ట్‌బ్రూస్‌ఫుట్ సంగనకల్లు పురావస్తు మ్యూజియం సండూర్ డైరీస్ సయుక్తంగా నిర్వహించిన బళ్లారి కోట వారసత్వ నడక ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని బళ్లారిలో ఏకశిల బెట్ట(కోట) సంగనకల్లు కొండ, రాబర్ట్ బ్రూస్‌ఫుట్ సంగనకల్లు పురావస్తు మ్యూజియం, సండూర్ డైరీస్ సంయుక్తంగా నిర్వహించిన బళ్లారి కోట వారసత్వ నడక ప్రారంభోత్సవంలో కుమారస్వామి దేవాలయం, కురహళ్ల రిజర్వాయర్, మించేరి కొండ, దరోజీ అభయారణ్యం, పాటు అనేక పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని తెలిపారు. సిరుగుప్పను వరిభూమిగా పిలుస్తారు. బళ్లారి నగరంలోని రాబర్ట్ బ్రూస్ ఫ్రూట్ సంగనకల్లు పురావస్తు మ్యూజియం దక్షిణ భారతదేశంలో పురాతన కాలం నాటి మానవ అవశేషాలను సేకరించిన ఏకైక మ్యూజియంగా పరిగణించబడుతుందన్నారు. అంతర్జాతీయ పరిశోధనా విద్యార్థులు ఇక్కడ పరిశోధన చేయడానికి ఆసక్తి చూపుతారన్నారు. విజయనగరం సామ్రాజ్యం నాటి చారిత్రక నిర్మాణ శైలి కలిగిన దేవాలయాలు జిల్లాలో ఉన్నాయని, మతపరమైన దేవాలయాలు , వారసత్వ ప్రదేశాలను సంరక్షించడం ద్వారా జిల్లాలో పర్యాటక అభివృద్ధిని ముందంజలో నడపాలన్నారు. ఈసందర్భంగా పర్యాటక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రభులింగ తలకేరి, రాబర్ట్ బ్రూస్ ఫ్రూట్ పురావస్తు మ్యూజియం సభ్యుడు అహిరాజ్, జిల్లా హోటల్ యజమానుల సంఘం కార్యదర్శి విక్రమ్ పోలా, సీనియర్ టూరిజం ప్రమోదర్, శ్రీహరి సండూర్ డైరీస్ సభ్యులు పాల్గొన్నారు.

సేవలతోనే సమాజంలో గుర్తింపు : ఎమ్మెల్యే

బళ్లారి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): సమాజం మేలు కోసం శ్రమించే వ్యక్తుల ఎప్పటికీ గౌరవించబడుతారని, సమాజం కోసం పనిచేస్తున్న వ్యక్తుల్లో నెక్కంటి సురేష్ ఒకరని శాసనసభ ప్రతిపక్ష ఉపనేత హుబ్బళి ఎమ్మెల్యే అరవింద్ బెల్లాడ. మాజీ ఎంపీ కే విరుపాక్షప్ప, దొడ్డనగౌడ హెచ్ పాటిల్ తదితర ప్రజాప్రతినిధులు అన్నారు. పీఎం నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను సింధనూరు పట్టణంలో శుక్రవారం అత్యంత ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసనసభ విరోదపక్ష ఉపనాయకుడు అరవింద్ బెల్లాడ మాట్లాడారు. గణపతి ఉత్సవాలు సింధనూరులో అత్యంత ఘనంగా నిర్వహించారన్నారు. ఉత్సవాల్లో బాగంగా రైతులకు మహరాష్ట్రకు చెందిన కాడసిద్దేశ్వరస్వామి జీ గురువులతో రైతులకు పంటలపై అవగాహన, విద్యార్థులకు మొక్కలు, పాఠ్యపుస్తకాల పంపిణీ, పౌక కార్మికులకు సన్మానం, మహిళలకు సాంస్కృతిక కార్యక్రమాలు ఇలా అనేక కార్యక్రమాలు పదకొండు రోజుల పాటు నిర్వహించి చరిత్ర సృష్టించారని అన్నారు. సింధనూరులో ఈ సారి జరిగిన హిందూ మహ గణపతి ఉత్సవాలు కనీవినీ ఎరుగుని రీతిలో జరిగాయని అన్నారు అనంతరం హిందూ మహగణపతి కమిటీ సభ్యుడు నెక్కంటి సురేష్‌కు సన్మానించారు. కమిటీ సభ్యులను అభినందించారు. విజయ కలర్స్ ల్యాబ్ విశ్వనాథ్ చౌదరి, వెంకోబ నాయక్, సిద్దరమేష్, జగదీష్, రామకృష్ణ, రాజశేఖర్, వంశీ, బాలకృష్ణ, పద్మానాయుడు, వెంకటేశ్, మణికాంత్ తదితరలు పాల్గొన్నారు.



హిందూ మహగణపతి సభ్యుడు నెక్కంటి సురేష్‌ను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

తప్పిపోయిన పిల్లల కోసం ప్రత్యేక గాలింపు

- అదనపు పోలీసు సూపరింటెండెంట్ నవీన్ కుమార్



మాట్లాడుతున్న ఏఎస్పీ నవీన్‌కుమార్

బళ్లారి సిటీ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన పిల్లల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు అదనపు పోలీసు సూపరింటెండెంట్ నవీన్ కుమార్ అన్నారు.శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 2021నుంచి జిల్లాలో 20మంది పిల్లలు అదృశ్యమయ్యారని వారిని కనిపెట్టడానికి , పోలీస్ స్టేషన్ అధికారులపై చర్యలు తీసుకోవడానికి ఒక ప్రత్యేక బృందం ఏర్పాటు చేస్తున్నామన్నారు. సివిల్ న్యాయాధికారి రాజేశ్ హొసమనె మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పాఠశాలలు , బహిరంగ ప్రదేశాలలో తప్పిపోయిన పిల్లల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. జిల్లా బాలల సంరక్షణ అధికారిణి సుభద్రాదేవి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు , అన్ని పాఠశాలలు, ప్రభుత్వకార్యాలయాల వాల్‌రైటింగ్ ఉండాలని, సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించాలన్నారు. పిల్లలు నిరంతరం పాఠశాలకు గైర్హాజరవుతుంటే చైల్డ్ వెల్ఫేర్ కమిటీ 1098 నెంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. ఈసమావేశంలో బాలల సంక్షేమ కమిటీ ఛైర్‌పర్సన్ విజయలక్ష్మి, మైదూరు ,పాఠశాల విద్యాశాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థల అధిపతులు, పారాలీగల్ వలంటీర్లు, పోలీస్ స్టేషన్ అధికారులు , బాలల రక్షణ సిబ్బంది పాల్గొన్నారు.

రిజర్వేషన్ల డిమాండ్‌తో 2న చలో ఢిల్లీ



కరపత్రాలను విడుదల చేస్తున్న సంచారజాతుల నాయకులు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సంచార జాతుల రిజర్వేషన్లలో 1శాతం ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని, ఆవిధంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని ఏఐసీసీ నాయకుడు లోక్‌సభలో ప్రతి పక్ష నాయకుడు రాహుల్ గాంధీని కోరుతూ కర్ణాటక అన్‌టచబుల్ కమ్యూనిటీస్ మహా కూటమి అక్టోబర్ 2న డిల్లీ చలో నిర్వహించనున్నట్లు కూటమి జిల్లాధ్యక్షుడు శివకుమార్ తెలిపారు. శుక్రవారం నగరంలోఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని సంచార జాతులకు ఒక శాతం రిజర్వేషన్ ఇవ్వాలని జస్టిస్ నాగమోహన్ దాస్ కమిషన్ నివేదిక పేర్కొంది. కానీ ముఖ్యమంత్రి సిద్దరామయ్య దీనికి మంత్రి వర్గ సమావేశంలో అంగీకరించలేదన్నారు. కాబట్టి 5శాతం రిజర్వేషన్ల ఇతర గ్రూపులో మమ్మల్ని చేర్చడం సరి కాదన్నారు. దీని కోసం 1000 మందికిపైగా సంచార జాతులవారు ఢిల్లీకి వెళ్ళి కాంగ్రెస్ కీలక నాయకులను కలుస్తామన్నారు. ఈసందర్భంలో రామాంజిని, బాబు, ధరుష్, సత్యప్ప, సుబ్బన్న, మహేశ్, అజ్జప్ప తదితరులున్నారు.

పాఠశాలల్లో విజయదశమి వేడుకలు



ఐరిష్ ఫ్లోరిస్ట్ స్కూల్లో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పిల్లల్లో దేశ సంస్కృతిని కాపాడటానికి, సంప్రదాయాలు పెంపొందించడానికి పాఠశాలల్లో విజయదశమి వేడుకలను నిర్వహించినట్లు పాఠశాల నిర్వహణ బోర్డు ఛైర్మన్ చల్లాకళ్యాణి అన్నారు. శుక్రవారం పలు పాఠశాలల్లో దసరా వేడుకల్లో విద్యార్థులు నవ దుర్గా వేషధారణలు అలరించాయి. ప్రైవేట్ స్కూల్ జిల్లా ఛైర్మన్ మర్రిస్వామి రెడ్డి మాట్లాడుతూ ఐరీస్ స్కూల్ నిర్వహించిన అద్భుతమైన కార్యక్రమాన్ని ప్రశంసించారు. పిల్లల్లో సంస్కృతి , మతం యొక్క ప్రాముఖ్యతను మెదటి నుండే పెంపొందించడం ప్రశంసనీయమన్నారు. ఈసందర్భంగా పాఠశాల యజమాన్య మండలి సభ్యులు చల్లా శివప్రసాద్, కొత్తపల్లి కిరణ్‌కుమార్, ప్రిన్సిపాల్ శైలజరెడ్డి, కోఆర్డినేటర్ హెప్సిబా, ఉపాధ్యాయులు దీప, శాంత జైనాబ్, నగ్మా, మెగాజైన్, ఇందు, తస్లీమ్, ముస్కాన్ తదితరులు పాల్గొన్నారు.

హోస్పేట నుంచి బెంగళూరుకు ప్రత్యేక రైలు

బళ్లారి రూరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో వుంచుకుని హోస్టే నుంచి బెంగళూరుకు ప్రత్యేక రైలు ఏర్పాటు చేశారు. ఎంపీ ఈ తుకారాం కోరిక మేరకు విజయనగరం, బళ్లారి జిల్లాల ప్రయాణికుల సౌకర్యం కోసం అదనపు పండుగ ప్రత్యేక రైలును ప్రారంభించారు. ఈ రైలు బెంగళూరులోని విశ్వేశ్వరయ్య స్టేషన్ నుంచి ఉదయం 7 గంటలకు బయలుదేరి తుమకూరు, అరసికెరె, రాయదుర్గం, బళ్లారి, మీదుగా మరుసటి రోజు కంటోన్మెంట్ మార్గం ద్వారా హోస్పేటకు 4.15 గంటలకు వెళుతుంది. 29వ తేదీన రాత్రి 8.45 గంటలకు హోస్పేట నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం అదేమార్గం ద్వారా హోస్పేటకు వెళుతుంది. ఉదయం 8.10 గంటలకు విశ్వేశ్వరయ్య రైల్వేస్టేషన్ చేరుకుంటుంది.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



వీరేష్

బళ్లారి రూరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని కారేకల్ గ్రామానికి చెందిన వీరేష్ ఈ నెల 24వ తేదీ నుంచి అదృశ్యం అయినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. సమత్ కుమార్ అనే వ్యక్తితో పాటు తల్లి సోదరుడు తండ్రి జోళదరాశి సమీపంలో దర్గాకు వచ్చారు. తల్లిదండ్రులు దర్గాలో కూర్చున్న సమయలో వీరేష్ బయటికి వెళ్లి తిరిగిరాలేదని వారు పేర్కొన్నారు. సీసీ కెమెరా పుటేజీలో ద్వారా తమ కుమారుడు రోడ్డు మార్గాన కనిపించకుండా వెళ్లినట్లు పోలీసులకు సమాచారం అందించారు. పీడీ హళ్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 08392-258100, 9480803052, 9480803062 తెలియజేయాలని పోలీసులు తెలిపారు.

హోసూరు జోన్

మారియమ్మ ఆలయానికి వెండికవచం



వెండికవచాలతో ఎమ్మెల్యే ప్రకాశ్ తదితరులు

హోసూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): బాగలూరులోని కొత్తమారియమ్మ ఆలయానికి వెండి కవచాన్ని ఎమ్మెల్యే ప్రకాశ్ కుటుంబీకులు శుక్రవారం బహూకరించారు. ఏటా ఇక్కడ ఆలయ రథోత్సవం విశేషంగా నిర్వహిస్తారు. కర్ణాటకకు చెందిన స్వర్ణకారులు కవచాన్ని రూపొందించారు. ఎమ్మెల్యే సోదరుడు చంద్రప్ప, డాక్టర్ సింధు, శ్రీనివాసన్‌లు అందచేశారు. ఈ సందర్భంగా విశేషపూజల్లో డిప్యూటి మేయర్ ఆనందయ్య, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పటాలమ్మ ఆలయంలో విశేష పూజలు



వారాహి అలంకరణలో అమ్మవారు

హోసూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అరుల్మిగు పటాలమ్మ ఆలయంలో శుక్రవారం విశేషపూజలు నిర్వహించారు. ఐదోరోజు అమ్మవారు వారాహిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నవగ్రహయాగం నిర్వహించారు. అభిషేకం, హారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అన్నదానం నిర్వహించారు.

విద్యార్థులు వందశాతం హాజరుపై ప్రశంసలు

హోసూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ మూడో వార్డులోని కార్పొరేషన్ మిడిల్‌స్కూల్‌లో ఇంగ్లిష్, తమిళం మీడియంలలో 885మంది విద్యార్థులు ఉన్నారు. మొదటి టర్మ్‌లో సెప్టెంబరు 26కు 82 పనిదినాలు పూర్తయ్యాయి. 6వ తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థులు వందశాతం హాజరుకల్గిన సాధించినవారికి ప్రధానోపాధ్యాయుడు పొన్నకేశ్ అభినందించారు. పాఠాలతోపాటు క్రమశిక్షణగా ఉంటూ ఇతరులకు ఆదర్శంగా ఉండాలని హెచ్ఎం పిలుపునిచ్చారు. సతీశ్‌కుమార్, సౌసిక, శంకర్, హరిణి, కనిష్క అనే విద్యార్థులను ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రశంసించారు. పాఠశాల లైబ్రరీ నుంచి తమకు ఇష్టమైన పుస్తకాలను ఇచ్చి ప్రోత్సహించారు. ఇతర విద్యార్థులకు కూడా ప్రోత్సాహకాలు అందచేశారు.



బహుమతులతో విద్యార్థులు

కమల జ్యువలరీస్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం





కుటుంబ సభ్యులతో కలిసి దుర్గమ్మ గుడివద్ద భక్తులకు అన్నదానం చేస్తున్నయజమాని శ్రీనివాస్

బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో కమల్ జ్యువలరీస్ ఆధ్వర్యంలో నగరంలోని దుర్గమ్మ ఆలయం వద్ద నిత్యం అన్నదానం చేపడ్తున్నట్లు కమల జ్యువలరీస్ యజమాని శ్రీనివాస్ తెలిపారు. నగరంలో పేరు మోసిన బంగారు వ్యాపారుల్లో ఒకరైన శ్రీనివాస్ కేవలం వ్యాపారమే ప్రధాన ధ్యేయంగా కాకుండా వ్యాపారంలో వచ్చిన లాభాల్లో కొంత భాగాన్ని సమాజ సేవలు ఉపయోగించాలనే సంకల్పంతో ఉన్నారు. కొన్నేళ్లుగా నగరంలోని కోట ప్రాంతం షిర్డీ సాయిబాబ దేవస్థానంలో ప్రతి గురువారం అన్నదానం నిర్వహిస్తూ భక్తుల మన్ననలు పొందుతున్నారు. బిమ్స్ ఆసుపత్రి వద్ద కూడా అన్నదానం నిర్వహిస్తూ రోగులుపాలిట అన్నదాతగా నిలుస్తున్నారు. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా పేదల వివాహాల నేపథ్యంతో తాళిబొట్టు ఉచితంగా అందజేసి పేదల పట్ల ఔదర్యాన్ని చాటుకుంటున్నారు. బంగారు శ్రీనివాస్ ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా తెనాలికి చెందిన వారు. దసరా ఉత్సవాల నేపథ్యంలో కుటుంబ సమేతంగా దుర్గమ్మ భక్తులకు స్వయానా వడ్డిస్తూ భక్తుల ఆకలి తీరుస్తున్నారు.

29న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బళ్లారి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రముఖ విద్యాలయం సరళాదేవి సతీశ్చంద్ర అగర్వాల్ ప్రభుత్వ కళాశాలలో ఈనెల 29న పాత విద్యార్థులు అంతా కలిసి ఉపాధ్యాయులను సన్మానించనున్నట్లు విద్యార్థుల సంఘ అధ్యక్షుడు వెంకటేశ్ హెగ్డే తెలిపారు. ఇదే కళాశాలలో చదివి ఇక్కడే లెక్చరర్లు, ప్రొఫెసర్లు పనిచేస్తున్న పాత విద్యార్థులకు, అలాగే ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న లెక్చరర్లకు సన్మానం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా బళ్లారి నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి హజరవుతారన్నారు. పూర్వ విద్యార్థులు తరలిరావాలన్నారు.

మహిళలను గౌరవిద్దాం

కంప్లి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళలను గుర్తించి గౌరవించినప్పుడే ఆ ప్రాంతం సుఖసంతోషాలతో జీవనం సాగించవచ్చని సమాజ సేవకుడు మూకయ్యా స్వామి శరణప్ప అన్నారు. నవరాత్రుల సందర్భంగా సన్నాపురం గ్రామంలో ఐదవ రోజు పురస్కరించుకుని బన్నిమహంకాళమ్మ ఆలయం వద్ద 90 మంది మహిళలకు లక్ష్మీదేవి, సువర్ణ, పార్వతి, రేణుక, ద్రాక్షాయణి, రేవతి, చెన్నమ్మ, శరణమ్మ ఆధ్వర్యంలో 90 మంది మహిళలకు ఒడినింపే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవరాత్రులు తొమ్మిది రోజుల పాటు ఎంతో పవిత్రమైన రోజులు అందలోఓ 5వ రోజు శుక్రవారం పురస్కరించుకుని మహిళలకు ఒడి నింపి గౌరవించి దేశ సాంప్రదాయాలను చాటుకుందామని తెలిపారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: ఏఐయూటీయూసీ

బళ్లారి సిటీ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని ఏఐయూటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సోమశేఖర్ కోరారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఐయూటీయూసీకి అనుబందంగా ఉన్న కర్ణాటక స్టేట్ యూనైటెడ్ వర్కర్స్ అసోసియేషన్, విమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ , కేపీటీసీఎల్ విద్యుత్ పంపిణీ కార్మికుల అసోసియేషన్, కర్ణాటక విద్యు సరఫరా కంపెనీల కాంట్రాక్ట్ ఎంప్లాయీస్, స్పాంజ్ ఐరన్ అసోసియేషన్ జిల్లాకలెక్టర్ ఎదుట నిరసన తెలిపి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ రద్దు చేయడం, శాశ్వత నియామకాలు చేపట్టడం ఇప్పటికే నిర్ణయించిన విధంగా వివిధ ప్రయోజనాల కోసం సహకార సంఘం ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం, సవరించిన కనీస వేతన పెంపును అమలు చేయడం , బళ్లారిలో ఈఎస్ఐ ఆసుపత్రిని ప్రారంభించడం తదితర డిమాండ్లను సత్వరమే పరిష్కరించాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల జీవితం చాలా కష్టతరమైనది, చాలా ప్రభుత్వ విభాగాలు , కర్మాగారాలు కాంట్రాక్ట్ కార్మికుల శ్రమపై ఆధారపడి ఉంటాయన్నారు. బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికులను పూర్తిగా బానిసలుగా మారుస్తున్నాయన్నారు. కార్మికులు తమ హక్కుల కోసం మరింత ఎక్కువగా సంఘటితమవ్వాలన్నారు. ఏఐయూటీయూసీ జిల్లాఅధ్యక్షుడు దేవదాసు మాట్లాడుతూ కాంట్రాక్ట్ దోపిడికి వ్యతిరేకంగా నిరంతర పోరాటం తప్పనిసరి అన్నారు. బళ్లారిలో 3,500 మందికి పైగా కార్మికులు సంఘంలో సభ్యులుగా ఉన్నారన్నారు. యూనియన్ ఏర్పాటులో ప్రభుత్వం జాప్యం చేయడం సరైనది కాదన్నారు. అదు విధంగా సవరించిన కనీస వేతన పెంపు నోటిఫికేషన్ ఇంకా అమలు కాలేదన్నారు. జిల్లాకార్యదర్శి ప్రమోద్ మాట్లాడుతూ బళ్లారిలో ఈఎస్ఐ ఆసుపత్రి చాలా కాలంగా ఉన్న డిమాండ్, జిల్లా యంత్రాంగం కూడా భూమిని గుర్తించిందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంకల్పం లేకుండా ఈఎస్ఐ ఆసుపత్రి ప్రారంభం కాలేదన్నారు. ఈసందర్భంగా ఆశా సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగలక్ష్మి, శాంత, సురేశ్, అశ్విని, చిట్టెమ్మ, హులుగప్ప, ఓబులమ్మ, వెంకటలక్ష్మి, పార్వతమ్మ, లక్ష్మి, హొన్నూర్, జయమ్మ, పుష్ప. వీరభద్రయ్య, నింగప్ప, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసనలో కార్మిక సంఘాల నాయకులు